క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేని గూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ ఈఈ పి.హరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కంద్రిక, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, బీబీగూడెం, గొల్లనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. గృహ, వ్యాపార, వ్యవసాయ, పరిశ్రమల వినియోగదారులు గమనించాలని కోరారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

కంకిపాడు: నిత్యావసరాల ధరలను నియంత్రించాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధిక వర్షాల వల్ల కూలీలకు ఉపాధి కరువైందన్నారు. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు నిత్యావసరాలను నియంత్రిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్నారు. అధిక ధరలకు విక్రయించటంతో పాటు కల్తీకి పాల్పడుతున్నారన్నారు. దుకాణాల వద్ద ధరల పట్టికలు ఉండటం లేదని, అధికారులు పట్టించుకోకపోవటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలను నియంత్రించి, పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులపై చర్యలు తీసుకోండి

కంకిపాడు: కూటమి నేతల బెదిరింపులపై చర్యలు తీసుకోవాలని అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ ద్వారా నిర్వహించిందన్నారు. కొందరు ఎమ్మెల్యేలు దుకాణాలు పొందిన వ్యక్తుల నుంచి బలవంతంగా కమీషన్ ఆశిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. బహిరంగంగా కొందరు ఎమ్మెల్యేలు చేస్తున్న హెచ్చరికలు మీడియాలో ప్రచారం జరుగుతుందన్నారు. ఈ చర్యలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం చేయటం సరికాదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్‌సీసీ ప్రతిభా పోటీల్లో బంగారు పతకం



ఉయ్యూరు: ఆలిండియా ట్రెక్కింగ్ క్యాంపు 35వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో చిత్తూరులో ఇటీవల పోటీలు నిర్వహించారు. వాలీబాల్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఏజీ అండ్‌ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ ఎం.మనోజ్‌కుమార్‌కు బంగారు పతకం లభించింది. ప్రతిభ చాటిన మనోజ్‌కుమార్‌ను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి శ్రీరాం అభినందించారు.


రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

నున్న(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో నున్న గ్రామ ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర(నాని)కు గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం బైక్‌పై నున్న నుంచి విజయవాడ వెళుతుండగా డీమార్ట్ వద్ద రోడ్డుపై అనుకొని విధంగా వేగంగా వచ్చిన గేదె ఢీ కొనడంతో ఎంపీటీసీ సభ్యుడి తలకు గాయమైంది. రోడ్డుపై పడిపోయిన ఎంపీటీసీని నున్న గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది చికిత్స నిమిత్తం దగ్గర్లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలకవర్గ సభ్యులు రాజు పరామర్శించారు.

అభయాంజనేయుడి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయుడికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు తమ్మా భాస్కరరావు, వెంకటలక్ష్మీ (గుడివాడ) సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పారిశుద్ధ్యం మెరుగవ్వాలి



విజయవాడరూరల్: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో అన్నారు. జిల్లా పంచాయతీ అధికారిగా ఉద్యోగబాధ్యతలను స్వీకరించిన లావణ్య కుమారిని మంగళవారం విజయవాడరూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కలిశారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వాతావరణానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు.

చెత్త ఫుల్.. సంపద నిల్

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు



పిచ్చి మొక్కలతో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఉంగుటూరు: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా గతంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటి వినియోగంపై దృష్టి పెట్టకపోవడంతో కాల క్రమేణా అవి మొక్కుబడిగా మిగిలిపోయాయి. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చెత్తను సేకరించి తడి, పొడి చెత్తగా వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు.

సంపద కేంద్రం నిర్వహణ..

చెత్తను సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేస్తామని గతంలో చెప్పారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ఇంటింటికీ రెండు రంగులతో రెండు ప్లాస్టిక్ డబ్బాలు కూడా పంపిణీ చేశారు. అన్ని పంచాయతీలకు చెత్తను తరలించేందుకు రిక్షాలను అందజేశారు. తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేసి విక్రయించి గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వాటిలో చాలా వరకు మూలన పడ్డాయి. వాటిని అలాగే వదిలేయడంతో గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టి ఏమోకాని గ్రామాల్లో రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

మందు బాబులకు అడ్డాగా..

చెత్త సంపద తయారీ కేంద్రాలు గ్రామ శివార్లలో ఉండటం.. పైగా నిరుపయోగంగా ఉండటంతో అవి మందు బాబులు తమ స్థావరాలుగా మార్చుకున్నారు. చెత్త సంపద కేంద్రం చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఉండటంతో వ్యర్థాలను అక్కడ వేస్తున్నారు. దీంతో వ్యర్థాల నుంచి దుర్వాసన వెలువడుతోంది. అటుగా రహదారిలో వెళ్లే వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చెత్త సంపద తయారు కేంద్రాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



వర్మీకం పోస్ట్ ఎరువుల తయారికి ఏర్పాటు చేసిన తొట్లు

> **వినియోగంలోకి తీసుకువస్తాం..**
>
> మండలంలో 16గ్రామ పంచాయతీలలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తాం. ఈ విషయమై ఇటీవల డీఎల్‌పీవోతో సమీక్షించాం. అవసరమైన చోట్ల మరమ్మతులను చేసి కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేద్దాం.
>
> – సత్యకుమార్, ఎంపీడీవో

వాలీబాల్ జిల్లా జట్లు ఎంపిక



జిల్లాకి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సుక్‌మిత్‌కౌర్

ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక ఉత్సాహంగా సాగింది. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో అండర్–14, 17 బాలురు, బాలికల వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక పెనమలూరు నియోజకవర్గ స్థాయి పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి బాల, బాలికల వాలీబాల్ జట్లకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జీవీ రమణ తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలను ఎంఈఓ సుధారాణి, హెచ్‌ఎం జ్యోత్స్నదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

హెచ్‌ఎంకే విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు: గోసాల హెచ్‌ఎంకే హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్, డైరెక్టర్ వసంత్‌కుమార్ మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పెనమలూరు నియోజకవర్గ స్థాయి అండర్–14 బాల బాలికల వాలీబాల్ పోటీలు ఉయ్యూరులో మంగళవారం జరిగాయన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన క్రీడాకారులు ఎం.అక్షయ, యార్లగడ్డ నిరుపమ, ఎం.గౌతమ్‌కృష్ణ ప్రతిభ చాటి జిల్లా స్థాయి జట్టులో స్థానం సాధించారన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన కోచ్ కోమటిగుంట రాజు, క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నూకల, నేరెళ్ల



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా, విద్యార్థులు

పెనమలూరు: కానూరులో మంగళవారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఘనంగా చేశారు. కానూరు అశోక్ జిమ్, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం చేశారు. తొలుత అబ్దుల్‌కలాం ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలాం..

ఉయ్యూరు: యువతకు నిత్యస్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం అని వక్తలు కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. తేజ డిజిటల్స్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా కేబినెట్ డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ భారతరత్న కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయేల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం

గన్నవరం రూరల్: ఆదర్శప్రాయుడు మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం అని ముస్తాబాద నవభారత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా అన్నారు. కలాం జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అబ్దుల్‌కలాం సేవలు మరువలేనివి

పెనమలూరు: భారతదేశం సాంకేతికంగా అభివృద్ధి సాధించి ప్రపంచదేశాలలో గుర్తింపు లభించే విధంగా ఏబీజే అబ్దుల్‌కలాం చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివని అనంత్ టెక్నాలజీస్ చైర్మన్, ఎస్ఐఏ ఇండియా అధ్యక్షుడు పావులూరి సుబ్బారావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా జరిగిన ఇన్నోవేషన్ డేలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత అబ్దుల్ కలాం ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ 800 మంది విద్యార్థులు 246 వినూత్న నమూనాలు ప్రదర్శించారని తెలిపారు. ఇందులో 50 గ్రాంట్ పేటెంట్లు ఉన్నాయన్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ



గన్నవరంలో ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, టీచర్లు, విద్యార్థులు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ డిస్లెక్సియా అవగాహన మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ప్రదర్శనను మండల విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యసన లోపాలను గుర్తించడం ద్వారా తగిన బోధన పద్ధతులను పాటించాలని తెలిపారు. అభ్యసన మెలకువలపై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. సిల్వర్ జూబ్లీ స్కూల్ హెచ్‌ఎం ఝాన్సీరాణి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల పురోభివృద్ధితోనే విద్యా ప్రగతి..

కంకిపాడు: పిల్లల పురోభివృద్ధితోనే విద్యా ప్రగతి సాధ్యమని కంకిపాడు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం పి.సాంబశివరావు అన్నారు. నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంకిపాడులోని ఎంపీపీ పాఠశాల నుంచి ప్రధాన సెంటర్ వరకూ విద్యార్థులు చేపట్టారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎస్.శిరీష, ఐఈ రీసోర్సు టీచర్లు పివిడి నాగేశ్వరి, ఎం.దీప్తి, ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థుల్లో అభ్యసన రుగ్మతలను అధిగమించేందుకు తగిన శిక్షణా నైపుణ్యాలను పెంపొందించటంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖాధికారి–2 బి.సురేష్‌కుమార్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని భవిత కేంద్రంలో ఆధ్వర్యంలో మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో చదవటం, రాయటం, నేర్చుకోవటంలో సమస్యలను గుర్తించి, తగిన శిక్షణ ఇవ్వాలని ఎంఈవో–2 సురేష్ కుమార్ సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉషారాణి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ



నున్న(విజయవాడరూరల్): వారధి ఫౌండేషన్ రాష్ట్ర స్థాయి డిబేట్ పోటీ–2024లో నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. రిటైర్డ్ సీఎస్ డాక్టర్ మోహన్‌కందా ఆధ్వర్యంలో నిర్వహించిన వారధి ఫౌండేషన్–రాష్ట్ర స్థాయి డిబేట్ పోటీ నందు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు జి.సంధ్య, కె.సలోమి, ఎ.ఐశ్వర్య ఎన్టీఆర్ జిల్లా తరపున పాల్గొని మూడో స్థానం సాధించి రూ. 27వేల నగదు బహుమతి అందుకున్నారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని 5వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.కవిత మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల ఎత్తు, బరువు పరిశీలించారు. చిన్న తనం నుంచే పిల్లలకు పోషక విలువలు గల ఆహారాన్ని అలవాటు చేయాలని తల్లులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో గార్డెన్ పెంచడానికి, ఇంకుడు గుంత తవ్వకానికి పరిస్థితులను ఆమె పరిశీలించారు.

నేడు హుండీల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండల రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఆలయ ప్రాంగణంలో లెక్కించనున్నట్లు వివరించారు. అమ్మవారి భక్తులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొంటారని వివరించారు.

మల్బరీ తోటల సాగుకు ప్రభుత్వ రాయితీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మల్బరీ తోట సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందని సెరికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ డి.వాణి అన్నారు. బాపులపాడు మండలం కె.సీతారామపురంలో మంగళవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. పట్టు పురుగుల పెంకపం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆమె వివరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం, బీసీలకు 50 శాతం రాయితీతో మల్బరీ తోటల సాగుకు రాయితీలు అందిస్తున్నారని వివరించారు. మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు, జరిమానా

గన్నవరం: చోరీ కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం మేరకు.. మండలంలోని గోపవరపుగూడెంకు చెందిన మండవ వెంకటసుబ్బారావు 2021 సెప్టెంబర్ 2వ తేదీన గన్నవరంలోని స్టేట్ బ్యాంక్‌లో రూ. 3 లక్షల నగదు డ్రా చేసి టీవీఎస్ ఎక్సెల్ డిక్కీలో పెట్టుకుని ఇంటికి బయలుదేరారు. గ్రామానికి వెళ్లిన తర్వాత డిక్కీలో పెట్టిన నగదు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన మేకల తిరుపతిని అరెస్ట్ చేయడంతో పాటు కోర్టులో చార్జ్‌షీట్‌ను కూడా దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి తిరుపతికి కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడికి అదనంగా రెండు నెలలు జైలుశిక్ష అమలు చేయాలని కోర్టు తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో సీఎంఎస్ పోలీసులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకిలో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి గ్రీన్‌ఫీల్డ్స్ అపార్టుమెంట్ కుటుంబ సభ్యులతో ఓ మహిళ ఉంటోంది. ఆమె కుమార్తె (19) ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా అదృశ్యమయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆమె జాడ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

రసాయన ఎరువులు తక్కువగా వాడాలి

జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



వణుకూరు 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి, ఈవో శైలజ

పెనమలూరు: రైతులు రసాయన ఎరువులు తక్కువగా వినియోగించి పంట నాణ్యమైన దిగుబడులు సాధించాలని కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలో గోసాల, వణుకూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి రైతులకు పలు సూచనలు చేశారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు మోతాదు మించి వాడరాదన్నారు. మండలంలో 1262 రకం వరికి బదులుగా 1318, 1061 రకం సాగు చేయాలని కోరారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌లో భాగంగా జీవామృతాన్ని తయారు రైతులకు చేసి చూపించారు.

సమస్యలు తెలిపిన రైతులు..

కాగా అధికారులకు రైతులు తమ సమస్యలు విన్నవించారు. వణుకూరులో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవటంతో పంట నీట మునుగుతుందన్నారు. రబీలో వరి సాగు చేయటానికి అనుమతులు ఇవ్వాలని, రబీలో పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. గతంలో మిల్లులకు తరలించిన ధాన్యానికి రవాణా ఖర్చులు ఇవ్వలేదని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, వీఏఏ కిరణ్మయి, చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ ఉపకరణాలు ఇవ్వండి..

గన్నవరం రూరల్: రైతులకు సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలు, స్ప్రేయర్‌లు, ఆయిల్ ఇంజిన్‌లు అందజేయాలని చిన అవుటపల్లి, తెంపల్లి, బల్లిపర్రు రైతులు మంగళవారం వ్యవసాయ శాఖ జిల్లా డీడీఏ మనోహర్‌రావు, గన్నవరం ఏడీఏ సునీల్‌ను కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన వారిని రైతులు కలసి ప్రభుత్వ పరంగా సబ్సిడీపై పైన కోరిన వ్యవసాయ ఉపకరణాలు అందజేయాలని విన్నవించారు. డీడీఏ మనోహరరావు మాట్లాడుతూ వరిలో సూక్ష్మ పోషకాల లోపాలు నివారించేందుకు సస్యరక్షణ చర్యలు సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్

పెనమలూరు: గ్రామాలలో అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. పెనమలూరు గ్రామంలో రూ. 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

సమస్యల వెల్లువ..

కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎమ్మెల్యే ప్రసాద్ పెనమలూరులో నిర్వహించిన సమయంలో అనేక సమస్యలు ప్రజలు విన్నవించుకున్నారు. గ్రామస్తుల నుంచి 44 సమస్యలతో అర్జీలు ఎమ్మెల్యేకు ఇచ్చారు. ప్రధానంగా పింఛన్‌లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, రోడ్లు అభివృద్ధి, ఇలా పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీడీవో బండి ప్రణతి, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు, మండల వైద్యధికారి బిజిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు



ఎనికేపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రూరల్ మండలంలోని రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రామవరప్పాడులో రూ. 37లక్షలతో సీసీ రోడ్డు, ఎనికేపాడులో రూ. 1.03 కోట్లతో మూడు సీసీ రోడ్లు, పంచాయతీ నిధు లు రూ. 18.50 లక్షలతో సీసీ రోడ్డు, నిడమానూరు లో రూ. 25లక్షలతో సీసీ రోడ్డు, గూడవల్లిలో రూ. 10లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి కొబ్బ రి కాయ కొట్టి శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కోనేరు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు శంకుస్థాపన..

ఉంగుటూరు: మండలంలో పెద్ద అవుటపల్లి, పొట్టిపాడు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని పలు రహదారులకు శంకుస్థాపన చేశారు. పెద్ద అవుటపల్లిలో ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.80లక్షలతో నాలుగు అంతర్గత రహదారులకు భూమి పూజ చేశారు. పొట్టిపాడులో రూ.27.50లక్షలతో పొట్టిపాడు నుంచి ఆనందపురం మీదుగా ఉయ్యూరు అడ్డ రోడ్డు(పిల్లికోడు) వరకు బీటీరోడ్డు అభివృద్ధి పనులు చేట్టనున్నారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఆయా గ్రామ సర్పంచులు జ్యోతి, తిరుపతమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీవో సత్యకుమార్, డీఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసు పాల్గొన్నారు.

పూట గడవడం లేదు.. జీతాలు ఇవ్వండి

పోరంకిలో సీఐటీయూ ధర్నా



పోరంకి సెంటర్‌లో చెత్త వ్యాన్ డ్రైవర్లతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

పెనమలూరు: తాగటానికి తిండి గింజలు లేవు.. మూడు నెలలుగా జీతాలు లేవు.. తమకు న్యాయం చేయాలని కోరుతూ తాడిగడప మునిసిపాలిటీలో చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు, సీఐటీయూ నేతలు ధర్నా చేశారు. పోరంకి సెంటర్‌లో మంగళవారం జరిగిన ధర్నాలో నేతలు మాట్లాడుతూ తాడిగడప మునిసిపాలిటీలో పని చేస్తున్న చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. గత నెల 26వ తేదీన జీతాల విషయమై తాడిగడప కమిషనర్‌ను కలిసి విన్నవించుకోగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే నేటికి వ్యాన్ డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేదన్నారు. రెండో రోజుకు చేరిన డ్రైవర్ల సమ్మెకు సీఐటీయూ పూర్తి మద్దతు ప్రకటించింది. వెంటనే ప్రభుత్వం స్పందించకపోతే మునిసిపాలిటీలో అందరూ సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. ఈ మేరకు వినతిపత్రాలు ఎమ్మెల్యే బోడెప్రసాద్, కమిషనర్ భవానీప్రసాద్‌కు అందజేశారు.